# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పీఎం ధన్ ధాన్య కృషి యోజనకు కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది.
- ❖ పార్లమెంటు అఖిలపక్ష సమావేశం ఈ ఆదివారం జరగనుంది.
- ❖ ఆహార పదార్థాల్లో నూనెల హానికర వినియోగం గురించి తెలియజేసే బోర్డులను పాఠశాలలో ఏర్పాటు చేయాలని సీబీఎస్ఈ కోరింది.
- ❖ బీహార్ లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్రంలో అనేక చోట్ల జనజీవనం స్తంభించింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27న ప్రసారమవుతుంది.

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈరోజు న్యూ ఢిల్లీలో సమావేశమయ్యింది. మంత్రి వర్గ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. ఈ మంత్రి మండలి సమావేశంలో పీఎం ధన్ ధాన్య కృషి యోజనకు ఆమోదం లభించిందని తెలిపారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంతో పాటూ.. వైవిధ్యమైన పంటల సాగు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించామన్నారు. తక్కువ ఉత్పాదకత నమోదవుతున్న 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నామని అశ్వినీ వైష్ణవ్ వివరిస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

అదే విధంగా పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి ఎన్టీపీసీలో 20 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కాబినేట్ కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే ఇటీవల అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం

(ఐఎస్ఎస్)లో 18 రోజుల పాటూ అనేక ప్రయోగాలను నిర్వహించి విజయవంతంగా భూమిపైకి తిరిగివచ్చిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లాను అభినందిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది.

==========================

పార్లమెంటు వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆదివారం జరగనున్న ఈ సమావేశంలో పార్లమెంటు ఉభయ సభలు సజావుగా సాగేలా ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల సహకారాన్ని కోరనుంది. ఇక ఈ వర్షాకాల సమావేశాలు వచ్చే సోమవారం ప్రారంభమై ఆగస్ట్ 21వ తేదీ వరకు జరగనున్నాయి.

==========================

విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి ఆయిల్ బోర్డులను ఏర్పాటు చేయాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) పాఠశాలలకు సూచించింది. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ఆహార పదార్థాల్లో నూనెల హానికర వినియోగం గురించి తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు పాఠశాలలకు సీబీఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ ప్రజ్ఞా ఎం.సింగ్ ఒక లేఖ రాశారు. వివిధ ఆహార పదార్థాల్లోని చక్కెర, నూనె శాతాలను తెలియజేసే డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయాలంటూ ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అన్ని విభాగాలు, కార్పొరేషన్లకు లేఖ రాసిన నేపథ్యంలో సీబీఎస్ఈ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. భారతదేశంలో ఊబకాయం గణనీయంగా పెరుగుతోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయని సీబీఎస్ఈ పాఠశాలలకు రాసిన ఆ లేఖలో పేర్కొంది.

==========================

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ ఆయుధరహిత డ్రోన్లను ఉపయోగించిందని... అయితే వాటిని భారత సాయుధ దళాలు సమర్థవంతంగా తటస్థీకరించాయని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (CDS) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. పాకిస్తాన్ డ్రోన్స్ ఏవీ భారత సైనిక స్థావరాలకు ఎటువంటి నష్టం కలిగించలేకపోయాయని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఈ రోజు మానవరహిత వైమానిక వాహనాలకు సంబంధించిన ఒక కార్యశాలలో ఆయన మాట్లాడుతూ.... ఆపరేషన్ సిందూర్ స్వదేశీ మానవరహిత వైమానిక వ్యవస్థల ప్రాముఖ్యతను తెలియజేసిందన్నారు. స్వదేశీ నిర్మిత రక్షణ ఉత్పత్తులపై పెట్టుబడులు పెట్టాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. విదేశీ సాంకేతికతపై ఆధారపడటం దేశ సంసిద్ధతను బలహీనపరుస్తుందని అనిల్ చౌహాన్ వివరిస్తూ..

(వాయిస్ 35 సెకన్లు)

విరామం

==========================

బీహార్‌లో గత 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్రంలో అనేక చోట్ల జనజీవనం స్తంభించింది. దర్థా, మోర్హార్, ఫాల్గు నదుల వరద ప్రవాహం ప్రమాద స్థాయికి చేరుకుంటున్నాయి. రోహ్తాస్ జిల్లా ఈ వర్షాలకు అత్యంత ప్రభావితమైంది. మరో 20కి పైగా జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. స్థానిక నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో వరద నీరు రహదారులపైకి చేరుకుంది.

==========================

స్వర్ణాంధ్ర విజన్ - 2047 పై ఏర్పాటైన టాస్క్ ఫోర్స్ నివేదికను ఈరోజు న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.... ఆగస్టు 15 నుండి వాట్సాప్‌లో అన్ని పౌర సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. సాంకేతిక యుగంలో ప్రభుత్వాల వద్ద ప్రజల

సమాచారం ఉంటుందని.. దాంతో ప్రజా సేవలను మరింత విస్తృతం చేయవచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలోనే డిజిటల్ హెల్త్ కార్డుల కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నామని వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

ఇరాన్‌కు అనవసర ప్రయాణాలను ఉపసంహరించుకోవాలని భారత రాయబార కార్యాలయం దేశ పౌరులను కోరింది. గత కొన్ని వారాలుగా ఇరాన్‌లో పెరుగుతున్న భద్రతా సమస్యల నేపథ్యంలో ఈ ప్రయాణ సూచనలను జారీ చేసింది.

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 25వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

===========================

భారత్, ఇంగ్లాండ్ మహిళా జట్ల మధ్య తొలి ఒన్ డే మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేస్తున్న ఇంగ్లాండ్ 46 ఓవర్లు పూర్తయ్యే సరికి 5 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్, స్నేహ రాణా రెండేసి వికెట్లు తీయగా శ్రీ చరణి ఒక వికెట్ తీసుకుంది.

===========================

రానున్న రెండు రోజుల్లో తూర్పు, మధ్య భారతదేశంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. రాబోయే వారం రోజుల్లో కేరళ, కర్ణాటక, తమిళనాడులలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

===========================
===========================